

పార్కింగ్ పరేషన్

వాణిజ్య, వ్యాపార ప్రాంతంగా అభివృద్ధి చెందుతోన్న బాన్సువాడ పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి.

- 9లో ▸



పక్షం రోజులైనా..

వరదల కారణంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ దెబ్బతిన్నది. డైవర్షన్ కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /22.1

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'ఉపాధి' ద్వారా ఇసుక మేటలు తొలగిస్తాం



బీబీపేట: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగిస్తామని డీఆర్డీఏ పీడీ సురేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయభూముల్లో ఇసుక మేటలను ఆయన పరిశీలించారు. బాధితులు జాబ్ కార్డు కలిగి ఉండి చిన్న, సన్నకారు రైతులు అయితే ఈజీఎస్ కూలీల ద్వారా పనులు చేయిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఏపీవో తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్

కామారెడ్డి అర్బన్: తెలంగాణ శ్రీసరస్వతి విద్యాపీఠం (ఎస్ఎస్‌వీపీ) ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రస్థాయి గణిత విజ్ఞాన, సంస్కృతి మహోత్సవం-2025 (రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్) నిర్వహించనున్నట్టు ఎస్ఎస్‌వీపీ జిల్లా అధ్యక్షుడు వి శ్యాంసుందర్‌రావు గురువారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కామారెడ్డి శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ యాదగిరి ముఖ్యఅతిథిగా, ఎస్ఎస్‌వీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్వీకే వెంకటేశ్వరరావు వక్తగా హాజరవుతారని, రాష్ట్రంలోని అన్ని శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూళ్ల నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

రిజర్వేషన్ హామీని నిలబెట్టుకున్నాం



కామారెడ్డి టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన 42శాతం బీసీ రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకున్నామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి నాయిని రజిత అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కా మారెడ్డిలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న బీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా మహిళలు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో మహిళా నాయకులు స్వప్న, ఫరీదా, జమున తదితరులు పాల్గొన్నారు.

'సాగర్' నుంచి 6 వేల క్యూసెక్కుల నీటి విడుదల



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ నుంచి వరద వస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి మంజీరలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు గురువారం సాయంత్రం తెలిపారు. ప్రాజెక్టులోకి 6,022 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తుండగా, అదే స్థాయిలో అవుట్ ఫ్లో ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు)కాగా ప్రస్తుతం 1404.99 అడుగుల (17.788 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



మాచారెడ్డి మండలం సోమారంపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ముదురుతున్న లొల్లి!

- యూరియా కోసం రైతుల ఆందోళనబాట
- పొలాలను వదిలి రోడ్లపైకి..
- అవసరమైన సమయంలో దొరక్క ఆందోళన

వ్యవసాయ భూముల్లో తిరగాల్సిన రైతులు యూరియా కోసం రోడ్లపైకి వస్తున్నారు. సరిపడా యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోడ్ వస్తోందని తెలియగానే ముందు రోజు నుంచే క్యూ కడుతున్నారు. రాత్రిళ్లు పడిగాపులు కాస్తున్నారు. పరిస్థితి ధర్నాలు, నిరసనలకు దారితీస్తోంది. తాజాగా జిల్లా కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : యూరియా సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. పొలాల్లో ఉండాల్సిన రైతులు రోజుల తరబడి సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అయినా దొరక్కపోవడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుని ఆందోళనకు దిగుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో యూరియా కొరత రైతుల్ని ఆందోళనకు గురిచేస్తోంది. కీలకమైన సమయంలో యూరియా దొరకడం లేదని ఆవేదనకు గురవుతున్నారు. కామారెడ్డి, మాచారెడ్డి, రామారెడ్డి, దోమకొండ, బీబీపేట, పాల్వంచ, భిక్కనూరు మండలాల్లో యూరియా సమస్య తీవ్రంగా ఉంది. అవసరానికి సరిపడా యూరియా సరఫరా కావడం లేదు. దీంతో రైతులు ప్రతిరోజూ యూరియా కోసం పొలాలను వదిలి సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. జిల్లాలో గతేడాది 48,904 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు. ఈ సారి ఇప్పటి వరకు 47 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఏడాదికేడాది రసాయన ఎరువుల వాడకం పెరుగుతోంది. ఇదే సమయంలో సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుండడంతో ఎరువుల అవసరం ఎక్కువైంది.

రోడ్డెక్కుతున్న రైతులు

ఎరువుల కోసం రోజుల తరబడి తిరిగి వేసారిన రైతులు ఆందోళనకు దిగుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల్లో గురువారం రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూరియా గొడవలపై స్పందించారు. అధికారుల మధ్య సమన్వయం, సరైన ప్రణాళిక లేకపోవడం



కామారెడ్డి మండలం గర్గుల్‌లో యూరియా కోసం క్యూ లైన్‌లో చెప్పులు పెట్టిన రైతులు

వల్లే సమస్య ఎదురవుతోందని పేర్కొన్నారు. ఒక్కచోటనే పంపిణీ చేయడంతో అన్ని గ్రామాల రైతులు అక్కడికి చేరుకుంటున్నారని, దీంతో అందరికీ సరిపోక గొడవలు జరుగుతున్నాయన్నారు. గ్రామాల వారీగా ప్రణాళిక రూపొందించుకుని ఎరువులను ఎక్కడికక్కడ పంపిణీ చేయాలని ఆదేశించారు. అయినప్పటికీ అధికారులు సరైన ప్రణాళికలు లేకుండా వ్యవహరిస్తున్నారని, ఫలితంగా రైతులు ఇబ్బందులు పడాల్సివస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్క బస్తా దొరకలేదు



నాటు వేయకముందు ఎరువు చల్లిన. యూరియా కోసం రామారెడ్డి, సదాశివనగర్‌కు పలుమార్లు తిరిగిన, వరుసలో నిల్చున్నా దొరకలేదు. అవసరమైన సమయంలో ఎరువు వేయకపోవడంతో వరి గంట పోయడం లేదు. దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఎవరూ పట్టించుకుంటలేరు.

– రాజిరెడ్డి, రైతు, ఉప్పల్‌వాయి

సొసైటీ చుట్టూ తిరుగుతున్నాం



ఆరు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నా. 24 బస్తాలు అవసరం ఉంది. ఇప్పటి వరకు 10 బస్తాలు దొరికాయి. ఇంకా 14 బస్తాల యూరియా కోసం సొసైటీ చుట్టూ తిరుగుతున్నా. సరిపడా యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు యూరియా చల్లితేనే పంట ఏపుగా పెరిగి దిగుబడి వస్తుంది.

– అంజల్‌రెడ్డి, రైతు, చుక్కాపూర్

ఎరువుల లోడ్‌తో లారీ వస్తోందని తెలిస్తే చాలు రైతులు సొసైటీల వద్దకు చేరుకుంటున్నారు. కొన్ని చోట్ల రాత్రి నుంచే వరుస కడుతున్నారు. చెప్పులు, రాళ్లు, ఇటుక పెళ్లలు, పాస్ పుస్తకాల జిరాక్సు కాపీలు..ఇలా ఏదో ఒకటి వరుసలో పెడుతున్నారు. కొన్ని చోట్ల రైతులు

లోడ్ రాకముందే వరుస..

అక్కడే నిద్రపోతున్నారు. ఒక్కోరైతుకు ఒక్క బస్తానే ఇస్తున్నారు. దీంతో రైతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి వరుస కడుతున్నారు. ముందుగా టోకెన్లు జారీ చేసి తరువాత ఎరువులు పంపిణీ చేస్తున్నారు. వందలాది మంది రైతులు వస్తుండడంతో రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. వరుసలో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితుల్లో రైతులు ప్రభుత్వ తీరుపై, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలం గొంతు నొక్కడమే..

- 'సాక్షి' ఎడిటర్, పాత్రికేయులపై అక్రమ కేసులు
- స్వేచ్ఛను హరించడమే..
- అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్ : ప్రజల పక్షాన అక్షర సమరం చేస్తున్న 'సాక్షి' పై కక్షగట్టి న ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్ర భుత్వం అక్రమ కేసులతో గొంతునొక్కుతూ భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని జర్నలిస్టు, ప్రజాసంఘాల నేతలు విమర్శించారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్ ధనంజయ రెడ్డితో పాటు పలువురు సాక్షి జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం అక్రమకేసులు బనాయించి వేధించడాన్ని నిరసించారు. పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగిస్తోందని మండిపడ్డారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కక్ష సాధించడం మానుకోవాలి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వ్యక్తిగత కక్ష సాధిస్తోంది. సాక్షి దినపత్రికపై పలు మార్లు దాడులు, అక్రమ కేసులు బనాయించడమే ఇందుకు నిదర్శనం. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి, అన్యాయం, అవినీతిపై వార్తలు రాసే పత్రికా స్వేచ్ఛను హరించడం దారుణం.

– రజనీకాంత్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు

కేంద్ర ప్రభుత్వం స్పందించాలి



ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి దినపత్రిక, చానల్‌పై జరుగుతున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి. చంద్రబాబు నాయుడు పత్రికా స్వేచ్ఛపై పాల్పడుతున్న కక్ష్య సాధింపు చర్యల్లో కేంద్ర ప్రభుత్వం హస్తం కూడా ఉందని భావిస్తున్నాం. ప్రజా సమస్యలను, అవినీతి, అక్రమాలు బయటపెడుతున్నందుకు కక్ష సాధించడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం.

– చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



పత్రికాస్వేచ్ఛపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఏదైనా ఉంటే చట్టపరంగా పోవాలే తప్పా ఇలా వ్యక్తిగతంగా సాక్షిపై కక్ష గట్టి అక్రమ కేసులు బనాయిండం, దాడులు చేయించడం సరికాదు. పత్రికా స్వేచ్ఛను కూటమిప్రభుత్వం కాపాడాలి. ఇలాంటి దాడుదు సరికాదు. ప్రజలే బుద్ధిచెబుతారు.

– లతీఫ్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ప్రజలను ఏం కాపాడుతారు..



ప్రజల పక్షాన నిలిచే మీడియానే గౌరవించని ప్రభుత్వం ప్రజలను ఏం కాపాడుతుంది. ఏపీలో టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికా స్వేచ్ఛ, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారు. టీడీపీ కార్యకర్తలు, పోలీసులతో సాక్షి కార్యాలయాలపై భౌతిక దాడులు చేయించడం, అక్రమ కేసులు బనాయిచడం పిరికిపంద చర్య. ప్రజలే బుద్ధి చెబుతారు.

– ఎల్ఎస్.ఆజాద్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రజాస్వామ్యానికి ప్రమాదం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం పౌరహక్కులు, జర్నలిస్టుల స్వేచ్ఛను హరిస్తోంది. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇప్పటికైనా పత్రికలపై కక్ష మానుకుని రాష్ట్ర అభివృద్ధివైపు అడుగు వేయాలని సూచిస్తున్నాం.

– జి.జగన్నాథం, జేఏసీ కన్వీనర్, కామారెడ్డి

చట్టాలను గౌరవించకుండా..



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వం పూర్తిగా చట్టాలను, న్యాయాన్ని గౌరవిచండం లేదు. కక్ష సాధింపులకు పాల్పడుతోంది. ఈ క్రమంలోనే సాక్షి దినపత్రిక, చానల్‌పై, కార్యాలయాలపై తరుచూ దాడులు చేయిస్తోంది. టీడీపీ కార్యకర్తలతో దాడులు చేయించడం చూసి చలించిపోయాం. ఇది ముమ్మాటికీ వ్యక్తిగత దాడిగా భావిస్తున్నాం.

– క్యాతం సిద్ధిరాములు, బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్, న్యాయవాది

మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు

- అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అత్యవసరమైతేనే బయటికి రావాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచన



కామారెడ్డి క్రైం: జిల్లాలో రానున్న ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సమాచారం అందించినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు కురిస్తే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని పేర్కొన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలు, వరదకు గురయ్యే ప్రాజెక్టులు, చెరువులు, ప్రమాదకరంగా ప్రవహించే వాగులు, కాలువలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లు, విద్యుత్ స్తంభాలు తదితర అన్నింటినీ ముందస్తుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను జిల్లా స్థాయిలో తెలియపర్చాలని అధికారులకు సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని స్పష్టం చేశారు. చేపల వేటకు వెళ్లడం, పశువులు, గొర్రెలను నీటి వనరుల వద్దకు తీసుకువెళ్లడం ప్రమాదకరమని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 08468-220069కు సమాచారం అందించాలని సూచించారు.

జిల్లా అంతటా వర్షం!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తోంది. మధ్యాహ్నం నుంచి కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఐదు రోజుల పాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. గత నెలలో కురిసిన భారీ వర్షంతో జిల్లా అతలాకుతలమైన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఇంకా చాలా రూట్లలో రోడ్లు క్లియర్ కాలేదు. మళ్లీ వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం అసాధ్యాలను సుసాధ్యం చేసింది

- బీసీలను అగ్రస్థానంలో నిలిపేందుకు రిజర్వేషన్లు
- ప్రజల అభ్యున్నతి కోసం పథకాలు
- ఉచిత బస్సు ప్రయాణంపై బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం
- పంచాయతీరాజ్‌శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

బీబీపేట/దోమకొండ/భిక్కనూరు: తమ ప్రభుత్వం అసాధ్యాలను సుసాధ్యం చేసిందని, రైతులకు మేలు చేకూర్చే ప్రభుత్వం తమదని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఈనెల 15వ తేదీన జిల్లా కేంద్రంలో బీసీ సభ నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం బీబీపేట, దోమకొండ, భిక్కనూరు మండల కేంద్రాల్లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించగా, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. బీసీలను రాజకీయంగా అగ్రస్థానంలో నిలిపేందుకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కాంగ్రెస్ ముందుకు తీసుకువచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, బీసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కేవలం ఓట్ల కోసం పథకాలను ప్రవేశపెట్టగా, కాంగ్రెస్ ప్రజల అభ్యున్నతికోసం పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సోషల్ మీడియాలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది మహిళలను కించపరచడమే అవుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ఆనాడు విద్యుత్ మంత్రిగా షబ్బీర్‌అలీ తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణల కారణంగానే నేడు ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోందని కొనియాడారు.



భిక్కనూరులో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క.. వేదికపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాయకులు

బ్రిడ్జి, పెద్ద చెరువు కట్ట పరిశీలన..

వరదల కారణంగా బీబీపేట ప్రధాన రహదారిపై దెబ్బతిన్న బ్రిడ్జిని మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పరిశీలించారు. నూతన బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అలాగే పెద్ద చెరువు బుంగ పూడ్చిన స్థలాన్ని కూడా వారు పరిశీలించారు.

నాడు రాజన్న.. నేడు రేవంతన్న

కాంగ్రెస్ అంటనే పేదల సంక్షేమ పార్టీ అని.. నాడు ప్రజాభివృద్ధిలో రాజన్న.. నేడు అదే బాటలో రేవంతన్న ముందుకు దూసుకెళ్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. ఆయా మండలాల్లో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. నాడు వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేయగా.. నేడు రేవంత్‌రెడ్డి పేదలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నారన్నారు. రాజకీయాల్లో కొత్త తరం రావాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. ఈనెల 15వ తేదీన కామారెడ్డిలో నిర్వహించనున్న బీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



దోమకొండలో ప్రసంగిస్తున్న షబ్బీర్‌అలీ

కేంద్రం సవతితల్లి ప్రేమే కారణం..

రాష్ట్రంలో రైతులు యూరియా కోసం కష్టాలు పడడానికి కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న సవతి తల్లి ప్రేమే కారణమని మంత్రి సీతక్క విమర్శించారు. సీజన్ ప్రారంబానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎంత మేరకు యూరియా అవసరమో కేంద్ర ప్రభుత్వానికి లేఖల ద్వారా వివరించిందన్నారు. ఆయా సమావేశాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, భిక్కనూరు, రాజంపేట, దోమకొండ, బీబీపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు భీంరెడ్డి, యాదవరెడ్డి, అనంతరెడ్డి, సుతారి రమేశ్, మార్కెట్ కమిటీల చైర్మన్‌లు రాజు, పాత రాజు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు నివాళులు

కామారెడ్డి క్రైం: జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. డీఎఫ్‌వో నిఖిత, అధికారులు అటవీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అధికారులను స్మరిస్తూ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎఫ్‌వో మాట్లాడుతూ.. విధుల్లో ఎదురయ్యే సవాళ్లకు భయపడొద్దని, సమష్టిగా ఎదుర్కోవాలని సూచించారు.

ప్రతి అధికారికి అండగా ఉంటామన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో అటవీశాఖ అధికారులు చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు రామకృష్ణ, సునీత, ఎఫ్ఆర్వోలు హబీబ్, రమేశ్, వాసుదేవ్, చరణ్ తేజ, హేమ చందన, రవికుమార్, సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో నిఖిత

క్లుప్తంగా

అలుగు పారుతున్న పోచారం ప్రాజెక్టు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టు 15 రోజులుగా అలుగు పారుతూనే ఉంది. ప్రాజెక్టుకు వచ్చే వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ఇన్‌ఫ్లోగా వచ్చిన నీరు అలుగుపై నుంచి జాలువారుతూ దిగువకు ప్రవహిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,182 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా 1,152 క్యూసెక్కుల నీరు అలుగుపై నుంచి దిగువకు ప్రవహిస్తూ అవుట్‌ఫ్లోగా వెళ్తుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అవగాహనే ఆయుధం



కామారెడ్డి క్రైం: అవగాహన పెంచుకోవడమే సైబర్ నేరాల నియంత్రణకు ప్రధాన ఆయుధమని ఎస్పీ రాజేశ్ చంద్ర అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నియంత్రణపై గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న సైబర్ వారియర్లకు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో తయారు చేసిన టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వేగంగా విస్తరిస్తున్నాయని అన్నారు. నేరాల నియంత్రణపై పూర్తి అవగాహన కలిగి ఉంటూ సాంకేతిక నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి లేదా స్థానిక పోలీసులకు లేదా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ నిపుణుల బృందం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సైబర్ క్రైం జిల్లా నోడల్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

పరామర్శ



భిక్కనూరు: ఏఎంసీ మాజీ డైరెక్టర్ బుర్రిగోపాల్‌ను బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నేత గంప శశాంక్ గురువారం పరామర్శించారు. గోపాల్ తల్లి రాజవ్వ రెండు రోజుల క్రితం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న శశాంక్.. బస్వాపూర్ గ్రామానికి వచ్చి గోపాల్‌ను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు రంజిత్ వర్మ, నేతలు ఉన్నారు.

‘కంది’ పంటకు కష్టం.. నష్టం

- అంతర పంటలో భాగంగా కంది సాగును నష్టంగా గుర్తించని అధికారులు
- సోయాను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్న అధికారులు
- రెండు పంటలకు పరిహారం ఇవ్వాలంటున్న రైతులు

బిచ్కుంద(జుక్కల్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బిచ్కుంద మండలంలో సోయా, పత్తి, కంది, పెసర, మినుము, వరి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. పంట చేలలో వరద నీరు ఆగి ఉండడంతో సోయా, కంది పంట మొక్కలు కుళ్లిపోయి పూర్తిగా మాడిపోయాయి. దెబ్బతిన్న పంటలను గుర్తించి నివేదిక అందించాలని ప్రభుత్వ ఆదేశంతో బిచ్కుంద మండలంలో వ్యవసాయ అధికారులు సర్వే చేపట్టారు. మండలంలో ఎక్కువ శాతం కందిలో అంతర పంటగా సోయా సాగవుతుంది. ఎకరం భూమిలో అంతర పంటలో సోయా, కంది రెండు పంటలు నష్టపోయినప్పటికి ఆ రెండు పంటను సర్వే నివేదికలో నమోదు చేయాల్సి ఉండగా అధికారులు కేవలం సోయా పంటకు మాత్రమే నష్ట జరిగిందని సర్వే నివేదికలో నమోదు చేయడం గమనర్హం. కంది కుళ్లిపోయి ఎండిపోయింది. కనీసం ఒక ఎకరం కూడా నష్టపోయిందని అధికారులు గుర్తించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నష్టం కింద ఒకే పంట పరిగణనలోకి తీసుకుంటే చాలా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరం కూడా గుర్తించకపోవడంపై ఆగ్రహం..

బిచ్కుంద మండలంలోని సిర్‌సముందర్, దేవాడ, దడ్గి, తక్కడ్‌పల్లి, బిచ్కుంద, దౌల్తాపూర్, గుండెకల్లూర్, మిషన్ కల్లాలి గ్రామాలలో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. అధికారులు సర్వే చేసి సోయా 2,685 ఎకరాలు, వరి 392 ఎకరాలు, పత్తి 86 ఎకరాలు, మినుము 18, పెసర 12 ఎకరాలు మొత్తం 3,193 ఎకరాలలో పంటలకు నష్టం జరిగిందని లెక్కలు తేల్చారు. వందల ఎకరాలలో కంది పంటకు నష్టం జరిగినప్పటికి ఒక్క ఎకరం కూడా గుర్తించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి నష్టంవాటిల్లిన రెండు పంటల వివరాలు తీసుకొని పరిహారం అందేవిధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.



బిచ్కుంద: సోయా అంతర పంటలో కుళ్లిపోయి ఎండిపోయిన కంది పంట

దిగుబడిపై వర్ష ప్రభావం...

భారీ వర్షాలతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. సాధారణంగా సోయా పంట ఎకరానికి 10 నుంచి 12 క్వింటాలు .. కంది 7 నుంచి 8 క్వింటాలు, పెసర 5 క్వింటాలు దిగుబడి వచ్చేది. పెసర, సోయా పూత దశలో ఉండగా వర్షాలు పడటంతో ఉన్నపూత రాలిపోయి కొన్ని కుళ్లిపోయాయి. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుతం సోయా దిగుబడి ఎకరానికి 6 నుంచి 7 క్వింటాలు, కంది ఎకరానికి 4 క్వింటాలు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. పెసర పంటకు పూర్తిగా నష్టం జరిగిందంటున్నారు.



నీరు నిలిచి కుళ్లిపోయిన సోయా పంట

నష్టం జరగకుండా చూస్తాం

ఒక ఎకరం భూమిలో అంతర పంటగా సాగవుతున్న రెండు పంటలు దెబ్బతింటే ఎకరం భూమి కింద ఒకే పంటను పరిగణలోకి తీసుకుంటున్నాం. సోయా అంతర పంటలో కంది సాగు అవుతుంది. ఏ పంటకు ఎక్కువ నష్టం ఉందో ఆ పంటను పరిగణలోకి తీసుకొని సర్వే నివేదికలో నమోదు చేస్తున్నాం. రైతులకు నష్టం జరగకుండా చూస్తాం.

–అమర్ ప్రసాద్, ఏవో, బిచ్కుంద



మద్నూర్(జుక్కల్): ఎవరో కళాకారుడు ఆకాశానికి రంగులద్దినట్లు కనపడుతున్న ఈ సుందర దృశ్యం మద్నూర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద గురువారం సాయంత్రం సూర్యాస్తమ సమయంలో ఆవిష్కృతమైంది. చెరువు గట్టుపై ఉన్న చెట్ల ప్రతిబింబం చెరువు నీటిలో కనపడిన దృశ్యాలు ప్రకృతి ప్రేమికులకు ఆకట్టుకుంది.

చిరుతపులి సంచారమంటూ వైరల్

- భయాందోళనకు గురైన మద్నూర్‌వాసులు
- అది చిరుత కాదు.. అడవి పిల్లి అని నిర్ధారించిన అటవీ శాఖాధికారులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో చిరుత పులి తిరుగుతుందని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు భయాందోళన చెందారు. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు మద్నూర్‌లో చిరుత పులి తిరిగిందని వాటి పాద ముద్రలు ఉన్నాయని వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో అధికారులు రంగంలోకి దిగారు. మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాంచందర్‌లు తన సిబ్బందితో మద్నూర్ శివారులో చిరుత అడుగులను పరిశీలించారు. పూర్తి విచారణ చేపట్టిన ఫారెస్ట్ అధికారులు అది చిరుత పులి పాదంకాదని అడవి పిల్లి పాదం అని తెల్పడంతో ప్రజలు ఊపిరిపిల్చుకున్నారు. చిరుత పులి అడుగులు పెద్దగా ఉంటాయని ప్రజలు ఆందోళన చెందవద్దని అటవీశాఖ అధికారులు తెలిపారు.



మద్నూర్ శివారులో అడుగులను పరిశీలిస్తున్న అధికారులు

సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించండి

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని పాత అంగడి బజార్, కుమ్మరి గల్లీ, పాత బాన్సువాడ, గౌలీగూడ, ఇస్లాంపూర తదితర కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని అన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పాడుతుందని అన్నారు. ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేస్తున్నారు కానీ ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు సాయిబాబా, చందర్, రమేష్ యాదవ్, ఇషాక్, సాయిలు, నాగనాథ్, ఉబేద్, అఫ్జల్, లతీఫ్ తదితరులు ఉన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ఇందిరమ్మ ఇళ్ల కోసం డబ్బులు ఇవ్వొద్దు

బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని కోనాపూర్, సంగోజీపేట్ తదితర గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు తమకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా తెలుసుకోవచ్చన్నారు. సందేహాల నివృత్తికి ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 18005995991ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు బిల్లుల చెల్లింపు, పనులకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేసే విధానాన్ని తెలిపారు. అవసరమైన ఇసుకను రెవెన్యూ అధికారి అనుమతితో ఉచితంగా తెచ్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ గోపాల్, ఏఈ వినీత్, పంచాయతీ కార్యదర్శి భరత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.



కోనాపూర్‌లో ఇంటినిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నేతలు కార్యకర్తలు గురువారం మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భిక్కనూరులో చేరారు. వీరికి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు బల్యాల రేఖ, నేతలు లింబాద్రి, దయాకర్‌రెడ్డి, శ్రీరాం వెంకటేశ్, విజయకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



భిక్కనూరులో మంత్రి సీతక్క సమక్షంలో చేరుతున్న నేతలు

రాత్రి వేళలో యూరియా పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు రాత్రిని సైతం లెక్క చేయకుండా క్యూ కట్టారు. యూరియా వస్తుందన్న వార్త తెలియగానే రైతులు విండో వద్దకు పరుగులు పెడుతున్నారని, దీంతో వచ్చిన 400 బస్తాలను రైతులకు పంపిణీ చేసినట్లు విండో సిబ్బంది పేర్కొన్నారు.



పద్మాజీవాడిలో యూరియా కోసం క్యూలో నిలబడ్డ రైతులు

పడిగాపులు కాస్తే ఒక్కో బస్తా..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కామారెడ్డి పట్టణంలో, గర్గుల్, చిన్నమల్లారెడ్డి గ్రామాల్లోని యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులు బుధవారం రాత్రి నుంచే యూరియా కోసం బారులు తీరారు. క్యూలైన్‌లో చెప్పులు, బస్తాలు, ఇటుకలు, రాళ్లు పెట్టి గురువారం ఉదయం వరకు వేచి ఉన్నారు. కామారెడ్డి, గర్గుల్, చిన్నమల్లారెడ్డికి 222 బస్తాల చొప్పున రాగా, వాటిని ఒక్కొక్కరికి ఒక్క బస్తా మాత్రమే పంపిణీ చేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. అయితే రాత్రి మళ్లీ యూరియా లోడ్ వస్తుందని మిగతా రైతులకు మూడో చోట్ల టోకెన్లు పంపిణీ చేశారు. దీంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒకవైపు వర్షాలతో పొలాల్లో నీళ్లు వచ్చి ఇబ్బంది పడుతున్నామని, అటు పొలాలను చూసుకోవాలా? ఇటు యూరియా కోసం తిరగాలా అని ప్రశ్నించారు. ఎక్కడికక్కడ సొసైటీలకు అవసరమైన యూరియా సరఫరా చేయాలని కోరారు. ఈ విషయమై మండల వ్యవసాయధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ... కామారెడ్డి మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రైతులు తరలి రావడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని. రైతులందరికీ సరిపడా యూరియా అందజేస్తామన్నారు.



గర్గుల్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో..

మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానీపేట, మాచారెడ్డి మండలం ఎల్లంపేట, సోమారంపేట గ్రామాల్లో రైతులు యూరియా కోసం బారులు తీరారు. భవానీపేటకు 220, ఎల్లంపేట, సోమారంపేటకు 220 చొప్పున బస్తాలు రాగా రైతులు ఒక్కసారిగా పోటీపడ్డారు. మాచారెడ్డి ఎస్సై అనిల్ రైతులను సముదాయించి టోకెన్లు ఇప్పించారు. సాయంత్రం వరకు టోకెన్లు తీసుకున్న రైతులు యూరియా తీసుకున్నారు.

యువకుడి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్ నగర్‌కు చెందిన కాంపెల్లి రాము అదృశ్యం అయినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. వినాయక్ నగర్‌లోని అంగిటి హోటల్ వద్ద రాము అదృశ్యమయ్యాడని, అతడి మానసిక స్థితి బాగాలేదని సోదరుడు తిరుపతి పేర్కొన్నాడు. తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు, నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా రాము ఆచూకీ తెలిస్తే 8712659840, 8712659836కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బాబాపూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై గోవర్ధన్ గురువారం తెలిపారు. బాబాపూర్‌కు చెందిన జంగిటి నరేష్, సుమలత వద్ద 7.92 లీటర్ల అక్రమ మద్యంను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అక్రమ మద్యం స్వాధీనం ఘటనలో సిబ్బంది దత్తాద్రి, శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్, రాణిలు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని పోచమ్మ కాలనీలో వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. కాలనీలో ఏడాది కాలంగా వ్యభిచారం చేస్తుండగా బుధవారం రాత్రి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్సై రాఘవేంద్ర సిబ్బందితో కలిసి సదరు గృహంపై దాడి చేశారు. బాన్సువాడ పట్టణానికి చెందిన సంగమిత్ర, బ్రమోత్ జయ, సాయాగౌడ్, బస్వాయిపల్లికి చెందిన హైమద్‌లను అదుపులోకి తీసుకున్నారు. నస్రుల్లాబాద్‌లో అసాంఘీక కార్యకలాపాలు జరుపుతున్న ఇంటి యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి రెండు ఫోన్లు రూ.500 నగదు స్వాదీనం చేసుకున్నామన్నారు. సంబంధిత వ్యక్తులపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక వాహనాల పట్టివేత

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని మందర్న శివారులో గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను, 2 ఆటోలను సాలూర రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాలను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ శశిభూషణ్ తెలిపారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు జీపీ కార్మికుల మృతి

- విద్యుత్ స్తంభాలు తరలిస్తుండగా ఘటన

బోధన్‌రూరల్: బోధన్ మండలం బిక్‌నెల్లీ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో విద్యుత్ స్తంభాలను తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు జీపీ కార్మికులు అక్కడిక్కడే మృతి చెందారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాలు ఇలా.. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా బిక్‌నెల్లీ గ్రామ శివారులోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో కొత్త స్తంభాలను తీసుకురావడానికి జీపీ డ్రైవర్ రాజు (అవుట్ ఓర్సింగ్), జీపీ కార్మికులు బాగారే బాలాజీ (42) (మల్టీపర్పస్ వర్కర్), బాగారే యాదు (40) (ఔట్‌సోర్సింగ్ వర్కర్) గురువారం రాంపూర్ సబ్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌పై విద్యుత్ స్తంభాలను తీసుకొని గ్రామానికి బయలుదేరారు. కల్దుర్కి శివారులో ఓవర్ లోడ్ కారణంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌ను నడిపిస్తున్న రాజు గాయాలతో బయటపడగా, ట్రాలీలో ఉన్న బాగారే బాలాజీ, బాగారే యాదుపై స్తంభాలు పడటంతో అక్కడిక్కడే మృతి చెందారు. బోధన్ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. జీపీ కార్యదర్శి సుధాకర్ ఆదేశాల మేరకే జీపీ సిబ్బంది ట్రాక్టర్‌లో స్తంభాలను తరలించారని ప్రచారం జరుగగా, ఘటనపై వివరాల కోసం జీపీ కార్యదర్శిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.



మృతిచెందిన బాగారే బాలాజీ, బాగారే యాదు

గుండెపోటుతో టీఏ మృతి



ధనుంజయ్ (ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ధనుంజయ్(45) గుండెపోటుతో మృతిచెందారు. విధుల్లో భాగంగా గురువారం ధనుంజయ్ బైక్‌పై బస్సాపూర్ గ్రామానికి బయలుదేరాడు. గ్రామంలో పర్యటిస్తుండగా అస్వస్థతకు గురై గుండెపోటు వచ్చింది. వెంటనే స్థానికులు అతడిని చికిత్సకు తరలించేలోపు మృతి చెందాడు. సమయానికి జీతాలు రాక ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒత్తిడికి గురికావడంతోనే ధనుంజయ్‌కి గుండెపోటు వచ్చిందని తోటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పిట్లం(జుక్కల్): మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులోగల మంజీరా నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గురువారం అటువైపుగా వెళ్లిన స్థానికులు నదిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేవని ఎస్సై వెంకట్రావ్ తెలిపారు. మృతురాలు సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలు నీలి రంగు చీర, మెరున్ కలర్ బ్లౌజ్, ఏడమ కాలుకి నలుపు రంగు తాడు, మెడలో న లుపురంగు తాడు, ఎడమ చేతికి ఆకు పచ్చ, గోల్డ్ కలర్ జులు, రెండుచేతులకి పువ్వుల ఆకారంలో పచ్చబొట్లు ఉన్నట్లు తెలిపారు. మృతదేహానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు పిట్లం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి పది రోజుల జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 16 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారికి గురువారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించిన, అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. వారిలో 15 మందికి జడ్జి రూ. 21,500 జరిమానా విధించారు. బోర్గాం(పి)కి చెందిన చామకూర లక్‌పతి తరచుగా (మూడుసార్లు) మద్యం తాగి దొరకడంతో జడ్జి అతడికి పది రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు.

ప్రియుడు మోసం చేశాడని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన సావిత్రి(ఫైల్)

ఎల్లారెడ్డి: ప్రియుడు మోసం చేయడంతో మనస్తాపం చెందిన ప్రియురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన బత్తుల సావిత్రి (20) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటికి తండ్రి రాంచందర్ ఇంటికి రాగా, ఉరివేసుకున్న కూతురును చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. సావిత్రికి లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డికి చెందిన మార్గపు ప్రదీప్‌తో ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నదని, అతడు నిరాకరించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి రాంచందర్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూపన్‌పల్లిలో ఓ వ్యక్తి మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. గూపన్‌పల్లికి చెందిన చింతకుంట రాజు(30) ఆటోడ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్నిరోజులుగా రాజు ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యల కారణంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈక్రమంలో గురువారం తీవ్ర మనస్తాపానికి గురై, ఇంటిలో ఎవరు లేని సమయంలో రాజు ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

కొండ చిలువ పట్టివేత

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని అయిలాపూర్ గ్రామంలో గురువారం 9 అడుగుల కొండ చిలువను పట్టుకున్నారు. అయిలాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి గల డ్రెయినేజీలో అలికిడి రావడంతో గ్రామస్తులు చూడగా భారీ పాముగా గుర్తించారు. వెంటనే నందిపేటకు చెందిన పాములు పట్టే సర్వర్‌కు సమాచారం అందించారు. వెంటనే సర్వర్ అయిలాపూర్‌కు చేరుకుని గ్రామస్తుల సహకారంతో డ్రెయినేజీలోని కొండ చిలువను పట్టుకుని రోడ్డుపై పడవేశాడు. కొంతసేపు కొండచిలువ అటుఇటుగా తిరగడంతో గ్రామస్తులు భయంతో కేకలు వేశారు. చివరికి దానిని అదుపులోకి తీసుకుని సంచిలో వేశాడు. పట్టుకున్న కొండ చిలువను అటవీ ప్రాంతంలో వదిలేయనున్నట్లు సర్వర్ వివరించాడు.



గోడ కూలి వృద్ధ దంపతులకు గాయాలు

మద్నూర్(జుక్కల్): మండలంలోని హండేకేలూర్‌లో ఇంట్లోని గోడ కూలడంతో వృద్ధ దంపతులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. హండేకేలూర్ లోని ఇంట్లో తుమ్మల్‌వార్ హన్మండ్లు, రుక్మిణీబాయి అనే వృద్ధ దంపతులు నివాసం ఉంటున్నారు. గురువారం ప్రమాదవశాత్తు ఇంట్లోని గోడ కూలి వారిపై పడటంతో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ముజీబ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు ఘటన స్థలానికి చేరుకొని, బాధితులను చికిత్స నిమిత్తం మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజుల క్రితం భారీ వర్షాలు కురవడంతో హన్మండ్లు ఇంటి గోడ నాని తడిసిపోవడంతో కూలిపోయిందని స్థానికులు తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లలో ఉండరాదని, ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్దని దరాస్ సాయిలు సూచించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు.

